


## నా లొకేషన్.. నా వాళ్లకు నోటిఫికేషన్

**ప్రస్తుత** కాలంలో సేఫ్టీ అనేది చాలా ముఖ్యమైన అంశంగా మారింది. టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందిన కారణంగా సేఫ్టీ ఫీచర్లు కూడా దానికి అనుగుణంగానే రూపొందిస్తున్నాయి టెక్ కంపెనీలు. మహిళలు, పిల్లలు బయటికి వెళ్లినప్పటి నుంచి ఇంటికి వచ్చేవరకు ఎక్కడ ఉన్నారు, ఎలా ఉన్నారు అనే విషయాలను తెలుసుకునేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

**ప్రతి** ఒక్కరి దగ్గరా స్మార్ట్ ఫోన్ ఉంటుంది. అందులో యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడం అనేది నేటి సమాజంలో భద్రతా సమస్యలకు ఒక పరిష్కార మార్గంగా ఉంది. 'నమోలా' యాప్ కూడా అదే కోవకు చెందినది. అత్యవసర సమయంలో సన్నిహితులను, స్నేహితులను లేదా పోలీసులను సంప్రదించడానికి ఈ యాప్ సహాయపడుతుంది.

**అత్యవసర** పరిస్థితుల్లో పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బందిని కూడా ఈ యాప్ ద్వారా సంప్రదించవచ్చు. ఈ యాప్ నుంచి లొకేషన్ షేర్ చేసే అవకాశం ఉంది. ఈ యాప్ వేసుకున్న వారు లొకేషన్‌కు చేరుకున్నా లేదా ప్రయాణాన్ని ప్రారంభించినా తమవాళ్లకు నోటిఫికేషన్ వెళ్లేలా ఆప్షన్‌ను పొందుపరిచారు. అంతేకాదు, ఎమర్జెన్సీ వైద్య సేవలు పొందే అవకాశాన్ని కూడా నమోలా యాప్ కల్పిస్తుంది. ఆండ్రాయిడ్ ఐఓఎస్‌లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌ను ఇప్పటికే లక్ష మందికిపైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు.

## ఆరోగ్య ఫలాలు

తాజా పండ్లు తినడం ఆరోగ్యకరమని తెలిసిందే. ముఖ్యంగా కొన్నిరకాల పండ్లను తరచూ తీసుకోవడం వల్ల మన శరీరానికి కావల్సిన పోషకాలు, ఖనిజలవణాలు పుష్కలంగా అందుతాయి. వాటిలో ఒకటి స్టార్ ఫ్రూట్. వేసవిలో ఎక్కువగా లభించే ఈ పండ్లను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం..

**నక్షత్ర** ఆకారంలో కనిపించే ఈ పండు జ్యూసీ జ్యూసీగా ఉండటమే కాదు బాగా పండిన పండ్లు పసుపు రంగులోకి మారి తియ్యగా ఉంటాయి. పచ్చి పండ్లు పుల్లగా ఉంటాయి. ఈ స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ ఎ, బి , సి పుష్కలంగా ఉంటాయి.

**రోజూ** స్టార్ ఫ్రూట్స్ తింటే మలబద్ధకం సమస్య దూరమవుతుంది. వికారం, వాంతులు, విరేచనాలు తదితర సమస్యలకు స్టార్ ఫ్రూట్స్ బాగా పనిచేస్తాయి.

**స్టార్** ఫ్రూట్స్‌లోని విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు.. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. ఈ పండ్లను తరచూ తీసుకుంటుంటే బరువు నియంత్రణలో ఉంటుంది. స్టార్ ఫ్రూట్స్‌లోని విటమిన్ బి12, జింక్.. జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి.

**ఈ** పండులో ఎక్కువ శాతం ఫైబర్, తక్కువ కేలరీలు ఉంటాయి. ఫైబర్ జీర్ణవ్యవస్థకు మంచిది.



నమస్తే తెలంగాణ
# జిందగీ
II
హైదరాబాద్ | శనివారం 1 జూన్ 2024 www.ntnews.com

## రోజూ ఇవి అడగండి

పిల్లలతో తల్లిదండ్రులు అన్ని విషయాలను చర్చించడం అనేది పెంపకంలో చాలా ముఖ్యమైన అంశం. అప్పుడే వారి మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుంది. పిల్లలతో ఎక్కువ సమయం గడిపితే వాళ్లలో కూడా మంచి ఆలోచనలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. స్కూల్‌లో స్నేహితులతో, ఉపాధ్యాయులతో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవాలి. వాళ్లు చెప్పేవి శ్రద్ధగా వినాలి. పిల్లల ఎమోషన్స్‌ను గౌరవించాలి.



### దగ్గర లేకుంటే..

'నేను నీతో ఉంటే ఎలా అనిపిస్తుంది. దూరంగా ఉన్నప్పుడు నీ ఫీలింగ్స్ ఏంటి' అని పిల్లలను అడగాలి. అప్పుడే వాళ్లు తమ ఇష్టాయిష్టాలను, భయాలను తల్లిదండ్రులతో చెప్పుకొంటారు.

### గుడ్ మెమొరీ..

నాతో గడిపిన సమయంలో నీకు బాగా నచ్చిన గుర్తున్న సంఘటన ఏంటి అని అడగాలి. అలాగే, కుటుంబసభ్యులతో గడిపిన సమయంలో నీకు బాగా ఇష్టమైనది ఏమిటి అని ప్రశ్నించాలి. వాళ్లు చెప్పే సమాధానాలను గౌరవిస్తున్నట్టుగా అనిపిస్తేనే పిల్లలు కూడా మనతో స్వేచ్ఛగా అన్ని విషయాలను షేర్ చేసుకోవడానికి సిద్ధమవుతారు.

### భయపడుతున్నావా?

చదువు, ఆటపాటలు ఇలా రోజులో పిల్లలు చాలా విషయాలలో తలమునకలైపోతారు. వాటిలో ఏ విషయంలోనైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా, ఒత్తిడికి గురవుతున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకోవాలి. పిల్లలు ఇచ్చే జవాబులు వారి మానసిక ఆరోగ్యాన్ని తెలియజేస్తాయని గుర్తుంచుకోవాలి.

### సందేహాలు..

పిల్లలకు అనేక సందేహాలు వస్తుంటాయి. కొన్నిసార్లు వాటిని అడగడానికి తటపటాయిస్తారు. తల్లిదండ్రులు ఆ పరిస్థితిని గుర్తించాలి. ఏదైనా అడగాలని అనుకుంటున్నారా? అని చొరవ చూపాలి. తెలియకపోతే ఏ విషయాన్నయినా అడిగేలా పిల్లలకు పేరెంట్స్ స్వేచ్ఛనివ్వాలి. అప్పుడే పిల్లలు మానసికంగా కూడా బలంగా ఎదగడానికి అవకాశం ఉంటుంది.

### ఏదంటే ఎక్కువ ఇష్టం?

ఇష్టాయిష్టాల గురించి అడగడం వల్ల కూడా తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య అనుబంధం రెట్టింపవుతుంది. అందుకే.. పిల్లలు ఎక్కువగా ఏది ఇష్టపడతారో వారినే అడిగి తెలుసుకోవాలి. పిల్లల ఇష్టాయిష్టాలు తరచూ మారుతూ ఉంటాయి. సమయానుగుణంగా వారితో మాట్లాడుతూ వారికి ఇష్టమైనది ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

# కేన్స్ క్వీన్స్!

వేదిక.. ఫ్రాన్స్. వేడుక.. కేన్స్ ఫిలిం ఫెస్టివల్. ప్రధాన పోటీ విభాగంలో ఒక చిత్ర ప్రదర్శన జరిగింది. అక్కడివాళ్లు ఎనిమిది నిమిషాలపాటు నిలబడి చప్పట్లు కొట్టారు. అత్యద్భుతం.. అసామాన్యం... అంటూ విమర్శకుల ప్రశంసలు వినిపించాయి. కేన్స్ ఫెస్టివల్‌లోని రెండో అతిపెద్ద అవార్డు 'గ్రాండ్ ప్రిక్స్'ను గెలుచుకుందా చిత్రం. అవును, నిజంగా అసామాన్యమే. ఎందుకంటే, భారత్‌కు ఈ కేటగిరీలో వచ్చిన తొలి పురస్కారం అది. దాని వెనుక ఉన్నది ఓ మహిళ . సినిమాలోని ప్రధాన పాత్రలూ మహిళలవే. మనవాళ్లు కేన్స్ క్వీన్స్ అయిన ఈ సందర్భంగా... ఆ చిత్రం గురించీ, దర్శకురాలు పాయల్ కపాడియా గురించిన సంగతులు...




**'ఆల్** వుయ్ ఇమాజిన్ యాజ్ లైట్'... సినిమా పేరు ఇప్పుడు భారతదేశం మొత్తం మారు మోగుతున్నది. విభిన్న నేపథ్యాల నుంచి ముంబయి వచ్చిన ముగ్గురు నర్సుల కథ ఇది. వివిధ కారణాల వల్ల నగరానికి చేరిన వీళ్లంతా ఒకే ఆసుపత్రిలో పనిచేస్తుంటారు. ఒక చిన్నగదిలో అద్దెకు ఉంటారు. వీళ్లలో ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య. ఓపక్క వాళ్ల జీవితాలను ఉన్నది ఉన్నట్టు చూపిస్తూనే, ఆ సమస్యలకు మెరుగైన పరిష్కార మార్గాలను మరోవైపు సూచిస్తున్నట్టుగా సాగుతుందీ కథ. ఇందులో దివ్యప్రభ, కని కుశ్రుతి, ఛాయా కదం... ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకురాలు పాయల్ కపాడియాతో కలిసి వీళ్లు కేన్స్ వేదిక మీద పురస్కారం అందుకున్నారు. కేన్స్ ప్రధాన పోటీ విభాగంలో ముప్పయ్యేండ్ల తర్వాత ప్రదర్శనకు ఎంపికైన మరో భారతీయ చిత్రం ఇది. ఇక, ఈ ఉత్సవంలోని రెండో అతిపెద్ద అవార్డునూ అందుకోవడంతో మనవాళ్ల ఉత్సాహం రెట్టింపయ్యింది. దీంతో పాయల్ కపాడియాను దేశం ఆకాశానికెత్తుతున్నది. ఈ ఒక్కటనే కాదు... పాయల్ తీసిన సినిమాలన్నిటిలోనూ మహిళలకు సంబంధించిన ప్రత్యేక కోణం ఉంటుంది. ఆమె ఎదిగిన పరిసరాలు, ఎదురైన అనుభవాలే ఇందుకు కారణంగా కనిపిస్తాయి.

### చిన్ననాటి నుంచే...

పాయల్ తల్లి ముంబయికి చెందిన ప్రముఖ చిత్రకారిణి నళిని మలాని. ఆమె పెయింటర్ మాత్రమే కాదు తొలి తరం వీడియో ఆర్టిస్ట్ కూడా. ఆమె గీసే చిత్రాల్లో ఎక్కువగా మహిళలకు సంబంధించిన రకరకాల అంశాలు కనిపిస్తూ ఉంటాయి. సొంతూరు ముంబయి అయినా పాయల్ చదువుకున్నది మాత్రం ఆంధ్రప్రదేశ్ రుషి వ్యాలీ స్కూల్‌లో. అనేక ఆధునిక బోధనా పద్ధతులకు, ప్రయోగాలకు ఆ పాఠశాల పెట్టింది పేరు. అక్కడే తను ప్రయోగాత్మక చిత్రాల దర్శకులు రిత్విక్ ఘటక్, ఆండ్రీ తర్కోవ్‌స్కీలాంటి వాళ్లను కలుసుకుంది. పాఠశాల ఫిలిం క్లబ్‌లో పాయల్ సభ్యురాలు. ఆ తర్వాత ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుంచి దర్శకత్వంలో పట్టా అందుకుంది. అడ్వర్టయిజింగ్ రంగంలోనూ కొన్నాళ్లు పనిచేసింది. అయితే చిన్ననాటి నుంచి సినిమాల మీద ఉన్న ఆసక్తి కారణంగా దర్శకత్వం వైపే వచ్చింది.

### మహిళే హీరో....

పాయల్ ఏ చిత్రం తీసినా, అందులో ఏ అంశం ప్రస్తావించినా చర్చంతా మహిళల చుట్టూనే తిరుగుతుంది. ఆమె కథకు హీరో ఎప్పుడూ మహిళే. 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్' పేరిట ఆమె రాసి, తీసిన తొలి చిత్రంలో ముంబయిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో తన పనిమనిషితో కలిసి జీవించే 70 ఏళ్ల వితంతువు కథను చూపించింది. అందులో ఆమె ఒంటరితనాన్ని సృజనాత్మక ధోరణిలో చిత్రీకరించింది.

2017లో భారత్ నుంచి కేన్స్‌లో ప్రదర్శనకు ఎంపికైన ఏకైక చిత్రం ఇది. తర్వాత ఆమె తీసిన 'ద లాస్ట్ మ్యాంగో బిఫోర్ ద మాన్‌సూన్'లో... భర్తను కోల్పోయి, తాను ఉంటున్న అడవిని వదిలి నగరానికి చేరి... భర్త గురించీ, అడవి గురించీ తల్లడిల్లే మహిళ కథను కళ్లకు కడుతుంది. ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకునే ఒక అమ్మాయి ప్రేమను కులం ఎలా ప్రభావితం చేసిందన్న అంశాన్ని 'ఎ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'లో చూపించింది పాయల్. 2021 కేన్స్‌లో బెస్ట్ డాక్యుమెంటరీ ఫిలింగా ఇది 'గోల్డెన్ ఐ' అవార్డును అందుకుంది. ఇలా... చిత్రం ఏదైనా, నేపథ్యం ఏమైనా పాయల్ కథలో మాత్రం ఎప్పుడూ మహిళే హీరో. సినిమా అవార్డు అందుకున్న సందర్భంగా ఆడవాళ్ల జీవితం గురించి తన మనసులో మాటను పంచుకున్నదామె.

**'నేను** చాలామంది ఆడవాళ్లు ఉండే ఇంట్లో పెరిగాను. కాబట్టి వాళ్ల మధ్య స్నేహం గురించి ఎప్పుడూ ఆలోచిస్తాను. అయితే భారత్‌లో అని కాదు, చాలా చోట్ల స్త్రీలు వాళ్ల పరిస్థితులను, పరిధిని దాటి ఆలోచించే ప్రయత్నం చేయరు. అంతకన్నా భిన్నంగా ఎలా బతకవచ్చో ఆలోచించరు. కాబట్టి వాళ్లు ఇలా కాకుండా ఎలా జీవించవచ్చో ఈ సినిమా ద్వారా చెప్పాలనుకున్నా. ఇందులోని కథలు నేను చూసిన కొంతమంది జీవితాలకు సంబంధించినవి. అందులో కొన్నిసార్లు నేను కూడా ఉండొచ్చు. నా వరకూ, సినిమా అంటే మనల్ని మనం అర్థం చేసుకోవడం. మన చుట్టూ ఉన్న పరిసరాలను, పరిస్థితులను అవగాహన చేసుకోవడం' అంటూ ముగించింది. నిజమే, స్త్రీ అనుకుంటే ఏదైనా సాధిస్తుందని చెప్పడానికి కేన్స్ అవార్డుతో నిలబడ్డ ఆమె ఫొటో నిలువెత్తు నిదర్శనం కదూ!



గాడిద పాలు చిన్నపిల్లల్లో ఉబ్బసం, ఆస్తమా, దగ్గు, కఫం వంటి సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయని తెలిసిందే! వీటిని సౌందర్య సాధనాల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఈ అంశాన్ని అవకాశంగా మలుచుకున్నది కోయంబత్తూరుకు చెందిన 26 ఏండ్ల మహాలక్ష్మి. ఎంబీఏ గ్రాడ్యుయేట్ అయిన మహాలక్ష్మి వినూత్న వ్యాపార సూత్రాన్ని ఎంచుకున్నది. గాడిద పాలతో సబ్బుల్ని తయారుచేస్తూ తన కృషి, ప్రతిభతో సంవత్సరానికి కోటికి పైగా ఆదాయాన్ని పొందడమే కాకుండా పలువురికి ఉపాధి చూపుతున్నది.

# గరిటెడైనను మేలు.. ఖరము పాలు

**సరిగ్గా** మూడేండ్ల కిందట మహాలక్ష్మి స్వయం ఉపాధి వ్యాపారాన్ని ప్రారంభించింది. ఆర్థికంగా స్వతంత్ర జీవితాన్ని గడపాలనే కోరికతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. యూట్యూబ్ వీడియోలను చూస్తూ సబ్బుల వ్యాపారం చేయడానికి ప్రయత్నించింది. కానీ, విఫలమైంది. ఇలా లాభం లేదనుకొని తక్కువ ఖర్చుతో నాణ్యమైన సబ్బుల తయారీకి నడుం బిగించింది. 'తక్కువ ధరతో ఉత్తమ సబ్బు' అనే నినాదంతో ముందుకొచ్చింది. అధిక నాణ్యత గల సబ్బుల తయారీకి ఉపయోగపడే చాలా పదార్థాలను క్షుణ్నంగా అన్వేషించింది.



సబ్బుల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల్లో మేక పాలు ఒకటని కనుక్కున్నది. కానీ, అదే సమయంలో, మార్కెట్‌లో మేక పాల సబ్బులను విక్రయించే బ్రాండ్లు చాలానే ఉన్నాయని తెలిసొచ్చింది. అయితే సౌందర్య సాధనలో మేకపాల కన్నా గాడిద పాలు మరింత ప్రశస్తంగా పనిచేస్తాయని తెలిశాక ముందడుగు వేయాలని నిశ్చయించుకుంది. స్థానికంగా ఉండే గాడిదల పోషకులతో చర్చించి పదేండ్ల దాకా పాలు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకుంది. సాధ్యమైనంత తక్కువ ధర ఉండేలా జాగ్రత్తపడింది.

గాడిద పాలు ముడిసరుకుగా మహాలక్ష్మి సబ్బుల తయారీ చేపట్టింది. పదిమందికీ ఉపాధి కల్పిస్తూ.. నెలల వ్యవధిలోనే విపణిలోకి ఎంట్రీ ఇచ్చింది. 2020లో సబ్బుల అమ్మకం మొదలైంది. ఇప్పుడు నేరుగా పదివేల మందికి సబ్బులు విక్రయిస్తున్నది. ఐదారు దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నది. దాదాపు 500 మంది మహాలక్ష్మి దగ్గర హోల్‌సేల్ ధరకు సబ్బులు కొనుగోలు చేసి మంచి లాభాలకు అమ్ముకుంటున్నారు. మొత్తంగా మూడేండ్లు తిరిగేసరికి ఏడాదికి కోటి రూపాయల టర్నోవర్ సాధించింది. గరిటెడు ఖరము పాలు ఇచ్చినా వాటితో కడివెడు కాసులు సంపాదించొచ్చని ఆంత్రప్రెన్యూర్లకు కొత్త అవకాశాల దారి చూపించిన మహాలక్ష్మికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే!

### టాప్ టిప్

## నోటికి 'పూస్తే'..

- నోటి అల్సర్ల నుంచి ఉపశమనం పొందడానికి తేనె చక్కటి మార్గం. నోట్లో కణజాలాలు చిట్లిపోవడం వల్ల అల్సర్ల సమస్య ఏర్పడుతుంది. కాబట్టి.. తేనె పూయడం వల్ల కొత్త కణజాలాలు తిరిగి ఏర్పడతాయి. ఒక టీ స్పూన్ తేనెలో చిటికెడు పసుపు కలిపి వీటిపై రాసినప్పుడు కొంత ఉపశమనం లభిస్తుంది.
- తులసి ఆకులు కూడా నోటిపూతకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. రోజుకు నాలుగైదు సార్లు తులసి ఆకులు నమలడం వల్ల నోటిపూత తొందరగా తగ్గుతుంది.








# సీతాకోక 'నగ'వులు

ప్రకృతిలోని అందమైన జీవుల్లో సీతాకోకచిలుక ఒకటి. హరివిల్లును మించిన రంగుల కలయికతో ఆకట్టుకునే వీటిని చిన్నపిల్లలు, మహిళలు మరీ ఇష్టపడతారు. అందుకే వాళ్ల దుస్తులతో పాటు ఇప్పుడు నగల్లోనూ సీతాకోకచిలుకలు ఒదిగిపోతున్నాయి. మగువలు ముచ్చటపడే ఈ రంగురంగుల సీతాకోక చిలుకల డిజైన్లతో మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి 'బటర్‌ఫ్లై నగలు'. కళ్లు జిగేల్‌మనిపించే హంగులతో అతివలను ఆకట్టుకుంటున్న ఆ జువెలరీ విశేషాలేంటో చూద్దాం...

**ఆభరణాల** అందాన్ని పెంచి అతివలను ఆకర్షించేందుకు ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్ తీసుకొస్తూనే ఉంటారు డిజైనర్లు. ప్రస్తుతం ఆధునిక మహిళలను ఆకట్టుకుంటూ అటు ఆన్‌లైన్లోనూ, ఇటు ఆఫ్‌లైన్ మార్కెట్లోనూ బటర్ ఫ్లై జువెలరీ ఆదరణ దక్కించుకుంటున్నది. సీతాకోకచిలుకల అందాన్ని జోడించి బంగారం, వెండి, ప్లాటినం వంటి లోహాలతో తయారుచేసిన ఆభరణాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు ఎనామిల్‌తోనూ రూపొందిన ఈ నగలు మగువల మేనిపై మెరిసిపోతున్నాయి. రంగురంగుల ఎనామిల్ సీతాకోకచిలుకలతో ముస్తాబు చేసిన పెండెంట్లను నచ్చిన విధంగా అలంకరించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏ రంగు దుస్తులు ధరిస్తే ఆ రంగు ఎనామిల్ సీతాకోకచిలుకల పెండెంట్లు, ఉంగరాలు, బ్రేస్‌లెట్లు ధరించి ఫుల్ మ్యాచింగ్‌లో తళుకులీనొచ్చు.

ఒకే డిజైన్ సీతాకోకచిలుకలతో రూపొందిన గొలుసులు, పెండెంట్లు, బ్రేస్‌లెట్లు, ఉంగరాలు, కమ్మలతో కూడిన కాంబోలు కూడా వచ్చేశాయి. ఖరీదైన లోహాలతో తయారుచేసిన భారీ ఆభరణాల్లోనే కాదు మినిమల్ జువెలరీలోనూ చిన్నిచిన్ని సీతాకోకచిలుకలను పొదుగుతున్నారు తయారీదారులు. ముత్యాలు, రాళ్లు, వజ్రాలు, పూసలు జోడించిన సీతాకోకచిలుకల ఆభరణాలు మహిళల అందాన్ని రెట్టింపు చేసి నలుగురిలోనూ ప్రత్యేకంగా నిలుపుతాయి. బంగారం, వెండితో తయారుచేసిన సెట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఖరీదైనవే కాకుండా రోజువారీ ఆభరణాలుగా అలంకరించుకునేందుకు సిల్క్, థ్రెడ్ బీడ్స్, ప్లాస్టిక్, రబ్బర్ వంటి సాధారణ నగలు కూడా అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ దుస్తులైనా, మోడ్రన్ డ్రెస్‌లైనా సీతాకోకచిలుకలు తోడైతే అందరిలోనూ ప్రత్యేకంగా మెరిసిపోవాల్సిందే!

